సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

కలెక్టర్ టిఎస్. చేతన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వీటిపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. ప్రస్తుత వర్షాకాలంలో వచ్చే మూడు నెలలపాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, దీనిని ఎదుర్కొనడానికి యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా జిల్లాలో చెరువులకు, కాలువలకు ఎక్కడా గండి పడకుండా చూడాలని, దీనికోసం ముందుగానే వాటిని పరిశీలించి నివేదిక తయారు చేయాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలో ఎంపిడిఒ, తహశీల్దార్, నీటిపారుదలశాఖ ఏఈలు కమిటీగా ఏర్పాటై, క్షేత్రస్థాయి పరిస్థితులను స్వయంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని సూచించారు. గండి పడే అవకాశం ఉన్నచోట తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంచాయతీ శాఖ గ్రామాల్లో ప్రతిరోజూ పారిశుధ్య పనులను నిర్వహించాలని, దోమలు విజృంభించకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యంగా ఈ సీజన్లో మలేరియా, డెంగీ, విష జ్వరాలు విజృంభించే అవకాశం ఉందని, దానిపై దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై పంచాయితీ కార్యదర్శులు, ఈవోపీఆర్డీలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మడకశిర, రొల్ల ప్రాంతాలలో వైద్య సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అన్ని రకాల మందులను ముందుగానే సిద్దంగా ఉంచాలన్నారు. అవసరమైతే వైద్య శిబిరాలను నిర్వహించేందుకు సైతం సిద్ధం కావాలన్నారు. ప్రతిరోజూ క్లోరినేషన్ చేయాలని, ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభం చేయాలని సూచించారు. పిడుగుల బారిన పడకుండా ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. జూన్ మూడో తేదీన విపత్తుల నిర్వహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, డిపిఒ సమత, డిఎంహెచ్ఒ ఫిరోజ్ బేగం ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- పాఠశాలలు ప్రారంభం.. ఫీజుల భయం
- తల్లిదండ్రుల్లో ఫీజుల దడ
- ప్రారంభమైన ఖరీఫ్ సీజన్
- రైతులకు పెట్టుబడుల బెంగ
- ఈ నెలంతా ఏదో రూపంలో ఖర్చులే
- తల్లికివందనం.. అన్నదాత సుఖీభవ సాయంపై ఆశలు

వామ్మో జూన్..!

పేద, సామాన్య, మధ్య తరగతి కుటుంబ సభ్యులకు జూన్ నెల భయం పట్టుకుంది. భారాల మాసంగా పిలవబడే ఈ నెలలో ఏదో రూపంలో జనంపై భారాలు పడుతూనే ఉంటాయి. విద్యార్థుల తల్లిదండ్రులకు జూన్ ఫీవర్ మరింత ఎక్కువగానే ఉంటుంది. భరించలేని ఫీజుల భారాలు, పుస్తకాలు, యూనిఫాం ఖర్చులన్నీ ఒకే సారి వస్తాయి. నోట్ల కట్టలతో పిల్లలను పాఠశాలలకు పంపాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇక ఖరీఫ్ సీజన్ కూడా ఈ నెల నుంచే ప్రారంభం అవుతుంది. తొలకరి వర్షాలు పడడంతో రైతులు ఖరీఫ్ సేద్యాన్ని ప్రారంభిస్తారు. పంటల సాగు నిమిత్తం పెట్టుబడుల కోసం రైతుల వెతుకులాట ప్రారంభం అవుతుంది. ఓ వైపు విద్యా సంవత్సరం.. మరో వైపు ఖరీఫ్ సీజన్ ఒకే సారి ప్రారంభం కావడంతో అన్ని కుటుంబాలపై ఏదో ఒక రూపంలో జూన్ భారం పడుతుంది.

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్కూల్ ఫీజుల భయం..!

వేసవి సెలవులు ముగింపు దశకు వచ్చేశాయి. మరో 10 రోజుల్లో పాఠశాలలు పున:ప్రారంభం అవుతాయి. ఇప్పటికే ప్రయివేటు పాఠశాలలు తెరిచారు. నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లను చేసేస్తున్నారు. పుస్తకాలు వచ్చాని, వెంటనే తీసుకోవాలంటూ తల్లిదండ్రులకు ఫోన్లమీద ఫోన్లు చేస్తున్నారు. ముందస్తు ఫీజులు, పుస్తకాలు కొనుగోలు చేయాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. కొత్త ఏడాది పిల్లల్ని పాఠశాలలకు పంపాలంటే ఇద్దరు విద్యార్థులు ఉన్న కుటుంబంలో ప్రయివేటు పాఠశాల అయితే రూ.40వేలు, కార్పొరేట్ పాఠశాల అయతే రూ.లక్షకు పైగా ఖర్చు చేయాల్సి ఉంది. ఫీజుల మోతతో తల్లిదండ్రులపై మోయలేని భారం పడుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1200 ప్రయివేటు పాఠశాలలు, 500 వరకు కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు 1.50 లక్షల మందికి పైగానే విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ నోట్ల కట్టలతోనే పాఠశాలలకు వెళ్లాలి. నర్సరీ స్థాయి నుంచే ఫీజుల రూపంలో రూ.25 నుంచి రూ.50వేల వరకు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు వసూలు చేస్తున్నాయి. విద్యార్థి తరగతి పెరిగే కొద్దీ ఫీజుల భారం కూడా పెరుగుతూ పోతోంది. హాస్టల్ ఫీజులు, పుస్తకాలు, యూని ఫామ్స్ ఇలా అన్నింటికీ లక్షల్లోనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇంట్లో ఇద్దరు పిల్లల ఉంటే ప్రస్తుతం కొంత ఫీజు కట్టి, పుస్తకాలు, యూనిఫాం తీసుకోవాలంటే రూ.70వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇక ఇంటర్, ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు అయితే వారు చదివే కళాశాలలను బట్టి ఒక్కొక్కరికి హాస్టల్, ఫీజులకు రూ.3 లక్షల వరకు ఖర్చు వస్తోంది. టెక్నో, సిబ్యాచ్, నీట్, ఎంసెట్, జెఇఇ, జెఇఇ అడ్వాన్స్డ్ తదితర వాటికి మరింత అదనంగా ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. డబ్బున్న వారికి ఇది పెద్ద సమస్య కాకున్నా సామాన్యులు, చిరుద్యోగులకు పెనుభారంగానే ఉంటోంది. ఫీజుల నియంత్రణ అంటూ ప్రభుత్వాలు చెబుతున్న మాటలు నీటిమూటలుగానే మిగులుతున్నాయి.

నోట్ల కట్టలతో విద్యాలయాలకు..!

ఒకప్పుడు విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో విద్యాలయానికి వెళ్లే వారు. కార్పొరేట్ విద్యా వ్యాపారం రాకతో తల్లిదండ్రులు నోట్ల కట్టలతో అక్కడికి వెళ్లాల్సిన పరిస్థితులు దాపురించాయి. గడిచిన పదేళ్ల కాలంలో వందలు వేలుగా, వేలు లక్షల్లాగా ఫీజులు పెరిగాయి. కార్పొరేట్ పాఠశాల అంటే చాలు లక్షల్లోనే ఫీజుల మాట విన్పిస్తోంది. అది కూడా ఎల్కెజి, యుకేజీ స్థాయికే ఈ స్థాయిలో డబ్బులను తల్లిదండ్రులతో లాగేస్తున్నారు. తమ పిల్లలు తమలా కాకుండా.. మంచిగా జీవితంలో స్థిర పడాలన్న ఉద్ధేశంతో తల్లిదండ్రులు వారి కష్టాన్ని మొత్తం ఫీజుల రూపంలో ప్రయివేటు, కార్పొరేట్కు దారబోస్తున్నారు.

తల్లికి వందనం.. అన్నదాత సుఖీభవపై ఆశలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంకా తల్లికి వందనం అందలేదు. ఎంత మంది పిల్లల్ని చదివిస్తున్నా అందరికీ తల్లికి వందనం ఇస్తామంటూ కూటమి నేతలు ఎన్నికలకు ముందు ప్రకటించారు. పాఠశాలల ప్రారంభం రోజు అంటే జూన్ 12న తల్లుల ఖాతాల్లో ఈ డబ్బులు వేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించాడు. దాని కోసం చాలా మంది తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. ఇక అన్నదాత సుఖీభవ అమలు కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు రైతుకు ఎలాంటి సాయం అందలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఖరీఫ్ పెట్టుబడి రాయితీ కింద ఎకరాకు రూ.20వేలు సాయం అందించి పంట సాగును ప్రోత్సహించాలని రైతులు కోరుతున్నారు.

అన్నదాతకు పెట్టుబడుల బెంగ

వ్యవసాయానికి సంబంధించి జూన్ నెల రైతులను కలవర పెడుతుంది. ఖరీఫ్ సీజన్ ఈ సమయంలోనే ప్రాంభం అవుతుంది. తొలకరి చినుకుల రాకతో పొలం పనులు ప్రారంభం అవుతాయి. ఇప్పటికే ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా కురిసిన ముందస్తు వర్షాలతో రైతులు వేసవి దుక్కుల పనుల్లో నిమగ్నం అయ్యారు. సబ్సిడీ వేరుశన విత్తనకాయలకు సంబంధించి రిజిస్ట్రేషన్ పనులు మొదలయ్యాయి. గతేడాది సరిగా పంటలు చేతికందక పెట్టుబడులు కూడా చేతికి రాలేదు. ఉద్యానవన రైతులు కూడా దిగుబడులు రాక నష్టాలను చవిచూశారు. ఈ నేపథ్యంలో రైతుల చేతిలో చిల్లిగవ్వలేకుండానే వ్యవసాయ పనులను ప్రారంభించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. విత్తనాలు, పురుగు మందుల కొనుగోలు, పొలం పనులు, కూలీలు ఇతరత్రా వాటికి ఎకరాకు రూ.30వేల వరకు పెట్టుబడులు ఖర్చు చేయాల్సి ఉంది. చేతిలో చిల్లిగవ్వ లేక రైతులు పంట సాగుకోసం అప్పులు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - హిందూపురం

అన్ని వర్గాల ప్రజలను ఆదుకోవడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పలు వార్డుల్లో సామాజిక పింఛన్లను ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు వీరయ్య, బాలాజీ, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పావులూరి శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులుతో కలసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరిని ప్రభుత్వ పథకాల్లో భాగస్వామ్యలను చేయడానికి ఓటమి ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు నాగరాజు, కౌన్సిలర్ రేష్మ బాను, కిరోసిన్ బాబు, వెంకటేష్, ఎన్.బి.కె. రాజు, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్కు సమస్యలు విన్నవిస్తున్న కాలనీవాసులు

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికలు : హిందూపురం పట్టణంలోని వివిధ వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం వార్డు పర్యటనలో భాగంగా అహమ్మద్ నగర్ లో పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో రహదారులు, మురికి కాలువలు, పారిశుధ్యం, వీధి దీపాలు, నీటి సమస్యల గురించి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలను పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు తీసుకుంటామని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు శ్రీనివాసరావు, వీరయ్య, బాలాజీ, మునిసిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు, కౌన్సిలర్లు రేష్మా బాను, ఆయూబ్, టీడీపీ సీనియర్ నాయకులు నాగరాజు, టీడీపీ నాయకులు కిరోసిన్ బాబు, ఎన్.బి.కె. రాజు, వెంకటేష్, సాదిక్, అబ్బు, షబ్బీర్, జబీవుల్లా, ఇంచార్జీ ఎమ్.ఈ. దస్తగిరి, డి.ఈ.ఈ. మోహన్, ఎమ్.హెచ్.ఓ. శోభన్ రెడ్డి, ఏ.సి.పి. చంద్రమ్మ, ఏ.ఈ. జనార్ధన్, శానిటరీ ఇన్స్పెక్టర్లు శంకర్, నిజాముద్దీన్, సచివాలయం సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఉచిత వేసవి బడుల నిర్వహణకు సహకారం

మాజీ మున్సిపల్ చైర్మన్ అనిల్కుమార్

ప్రజాశక్తి - హిందూపురం

పేద విద్యార్థుల విద్యాభివృద్ధిలో భాగంగా ప్రతి ఏటా మార్గదర్శి విద్యానికేతన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి బడులకు తమ వంతు సహకారం అందిస్తామని మాజీ మున్సిపల్ చైర్మన్ జేవి అనిల్ కుమార్ పేర్కొన్నారు. ఉచిత వేసవి బడులను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు, కలర్ పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఉచిత వేసవిబడి నిర్వాహకులు కె.సాయికళ కె.మాళప్ప దంపతులను ఆయన అభినందించారు. ఆయనతో పాటు 4 వ వార్డు యూనిట్ ఇంచార్జ్ వెంకటరమణ, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు బియన్.మూర్తి, నాయకులు ముస్తఫా,కలీమ్ హాజరయ్యారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న నాయకులు

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ జగన్

రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత

వృద్ధుడికి పింఛను అందజేస్తున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ జగన్ రెడ్డి అని అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ ముఖ్యమంత్రి చంద్రబాబు అని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. ఓటేసిన ప్రజలను, కన్నతల్లిని, చెల్లెళ్లను మోసగించిన జగన్ కంటే ఈ లోకంలో ఇంకెవ్వరూ వెన్నుపోటుదారుడు ఉండరన్నారు. పట్టణంలోని న్యూ కాలనీలో శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను, ఉచిత గ్యాస్ సిలిండ్లను మంత్రి సవిత ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వెన్నుపోటుకు, గొడ్డలిపోటుకు జగన్ బ్రాండ్ అంబాసిడరన్నారు. అధికారం కోసం ఇష్టారాజ్యంగా హామీలిచ్చి అమలు చేయకుండా చేతులెత్తేసిన అసమర్ధుడు జగన్ రెడ్డి అని విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా అమరావతే రాజధాని అని చెప్పి గెలిచిన తరవాత మూడు ముక్కలాటకు జగన్ రెడ్డి తెరతీశాడన్నారు. పోలవరం పూర్తి చేస్తానని చెప్పి పట్టించుకోవడం మానేశాడన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలను అన్ని విధాల వెన్నుపోటు పొడిచిన జగన్ సిగ్గుపడాలన్నారు. ఎవరికి వ్యతిరేకంగా వెన్నుపోటు దినోత్సవం నిర్వహిస్తున్నారని మంత్రి ప్రశ్నించారు.

హామీలన్నీ నెరవేరుస్తున్నాం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 12 నెలల కాలంలోనే ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా నెరవేర్చుతోందని మంత్రి సవిత తెలిపారు. అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామన్నారు. ఉచిత ఇసుక, మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నామన్నారు. మెగా డీఎస్సీ నిర్వహిస్తున్నామన్నారు. జగన్ చీకటి చట్టం ల్యాండ్ టైటిల్ యాక్టు రద్దు చేశామని తెలిపారు.యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా లక్షల కోట్ల విలువైన పరిశ్రమలను తీసుకొస్తున్నామన్నారు.

12న 71 వేలకు పైగా స్పౌజ్ పింఛన్లు

రాష్ట్రంలో కొత్తగా 71,380 మందికి స్పౌజ్ పింఛన్లు అందజేయనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. స్పౌజ్ కేటగిరీ పింఛన్ల ద్వారా నెలకు రూ. 4 వేల చొప్పున పింఛన్ అందించనున్నామన్నారు. ఈ నెల 12వ తేదీన స్పౌజ్ పెన్షన్లు పంపిణీ చేయనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. దీపం-2 పథకంలో భాగంగా మహిళా లబ్ధిదారులకు మంత్రి సవిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. స్వయంగా లబ్ధిదారుని ఇంట్లో గ్యాస్ పొయ్యి వెలిగించి, టీ చేసి లబ్ధిదారు కుటుంబ సభ్యులకు మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ కన్వీనర్ శ్రీరాములు యాదవ్, మండల కన్వీనర్ ఈశ్వర ప్రసాద్, కూటమి నాయకులు రామకృష్ణ నాయుడు, బాబుల్ రెడ్డి, వడ్డే చంద్ర, మహిళా నాయకురాలు రమణమ్మ, చంద్రకాంతమ్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : రాష్ట్రంలో ఒక రోజు ముందే పెన్షన్ల పండుగ నెలకొందని మంత్రి సవిత తెలిపారు. శనివారం మండలంలోని నారానాగేపల్లి గ్రామంలో పెన్షన్ల ,పంపిణీ,దీపం 2 పథకం కింద ఉచిత సిలిండర్ పంపిణీ కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టాక రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. ఈ 9 నెలల్లో రొద్దం మండలంలో 11 కోట్ల రూపాయల నిధులతో సిసి రోడ్లు డ్రైనేజీలు ,బ్రిడ్జి ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. నారనాగేపల్లి నుంచి కర్ణాటక రాష్ట్రం బుగూడూరుకి వెళ్లే దారికి రోడ్డు వేయాలని, అదే విదంగా కుర్లపల్లి వద్ద నుంచి నాగిరెడ్డి పల్లి వెళ్లే దారి కూడా రోడ్డు వేయాలని స్థానికులు మంత్రికి విన్నవించగా స్పందించిన ఆమె రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరహరి, మాధవనాయుడు, చిన్నప్పయ్య,చంద్రమౌళి, అశ్వర్ధనారాయణ, వీరాంజి, చిన్నమంతురు పవన్,శ్రీనాథ్ చౌదరి, మంజు, హరీష్, పవన్, నాగభూషణ, మనోహర్, ధనుంజయ గౌడ్, హనుమంతప్ప, సోమశేఖర్, నాగిరెడ్డి, లక్ష్మి నారాయణ, సుబ్బారాయుడు, మహేష్, యల్లప్ప, లింగప్ప, గోవిందు,సోమశేఖర్, అనిల్ తదతరులు పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజ స్థాపనకు కృషి

హిందూపురం : పొగాకు రహిత సమాజ స్థాపన కోసం అన్ని వర్గాల ప్రజలు కలిసి రావాలని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు కోరారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వ ఆసుపత్రి దంత విభాగం వైద్యులు భూపాళం విజయబాబు, సురేఖ దేవి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ పొగాకు సర్వరోగకారిణి అని అన్నారు. పొగాకు ఉత్పత్తులపై యువతను, ప్రజలను చైతన్యం చేయడమంటే వారి ఆయుష్షును పెంచినట్లేనని వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారణి డాక్టర్ జయం పద్మజ, వైద్యులు చరణ్, మోహన్ బాబు, అపర్ణ, రమ్య, భరత్ , శ్రీనివాస్ తోపాటు లోకేష్, చైతన్య, లక్ష్మీనారాయణ, పిపి యూనిట్ వైద్యులు డాక్టర్ కేసీ నాయక్, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

హక్కులతో పాటు బాధ్యతలు గుర్తించాలి

ప్రజాశక్తి - హిందూపురం

ప్రజలు తమ హక్కుల తో పాటు బాధ్యతలను కూడా గుర్తించాలని డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్ సూచించారు. శనివారం హిందూపురం రూరల్ మండల పరిధిలోని మణే సముద్రం ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికి నిర్దిష్టమైన హక్కులు, బాధ్యతలను ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజలు తమ బాధ్యతలను గుర్తించి హక్కులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జయరామిరెడ్డి, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, రైతుల కష్టాలు పట్టవా ..?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలో తాగునీటి పథకాల్లో పనిచేసే కార్మికుల గోడు పాలకులకు పట్టడం లేదు. ప్రజలకు నీటిని అందించేందుకు అహర్నిశలు పనిచేసే కార్మికులకు మాత్రం ఎప్పుడూ పస్తులు తప్పడం లేదు. వేతనాల కోసం ప్రతి నిత్యం పోరాటం సాగించాల్సిన పరిస్థితే నెలకొంది. పనిచేసినందుకు నెలల తరబడి వేతనాలివ్వకపోవడంతో వారు సమ్మెలోకెళ్లాల్సి వస్తోంది. అప్పుడూ ఎంతోకొంత సర్దుబాటు చేయడం మమ అనిపించడమే జరుగుతోంది. ప్రధానంగా శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల పరిస్థితి ఎప్పుడూ ఇదే తీరున ఉంటోంది. ప్రస్తుతం ఆ కార్మికుల సమ్మెలో ఉండటంతో గ్రామాలకు తాగునీరు కూడా అందక ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను మంత్రుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండటం లేదు. కాంట్రాక్టరు మాత్రం ప్రభుత్వం నుంచి బిల్లులు రాలేదని, అవి వస్తే ఇస్తానని చెబుతుండటంతో వేతనాల కోసం కార్మికులు సమ్మెబాట పట్టక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. ఇతర సిడబ్లుసి పథకాల్లోనూ ఇదే తీరు కొనసాగుతోంది. తరచూ ఈ సమస్య రావడానికి ప్రధాన కారణం ప్రభుత్వ విధానంలోని లోపమేనన్న విమర్శ ఉంది. పథకాల మంజూరుకు కోట్లాది రూపాయల నిధులను ప్రభుత్వం వెచ్చిస్తోంది. కాని వాటి నిర్వహణకు మాత్రం నిధులు ప్రత్యేకంగా కేటాయించడం లేదు. స్థానిక సంస్థలకు వచ్చే నిధులనే వీటికి వాడుకోవాల్సి ఉంటోంది. స్థానిక సంస్థలకు నిధుల విడుదలకు

జాప్యం జరిగినా,ఇతర అవసరాలకు వినియోగించినా వీటి నిర్వహణ కింద పనిచేసే వారికి డబ్బులు చెల్లించడంలో జాప్యం జరుగుతోంది. ఫలితంగా కార్మికులకు వేతనాలు అందటంలో తీరని జాప్యం జరుగుతోంది. వారు పోరాటం చేసినప్పుడు ఇతర పథకాల నుంచి సర్దుబాటు చేసి ఇస్తున్నారు. దీనికి ప్రత్యేకమైన హెడ్ ఏర్పాటు చేసి నిధుల కేటాయింపులు జరపాలని పథకం కింద పనిచేసే కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు. ప్రత్యేకంగా దీనికి నిధులొస్తే ఇబ్బందులుండవని సూచిస్తున్నారు. కాని కాంట్రాక్టును ఏ రకంగా దక్కించుకోవాలని నేతల ఆలోచనలుంటున్నాయే తప్ప నిధుల కేటాయింపులపై మాత్రం దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి. కార్మికుల సమస్యలు ఈ విధంగా ఉంటే రైతుల సమస్యలు మరో రకంగానున్నాయి. మే నెలలో జిల్లాలో మంచి వర్షాలు పడ్డాయి. దీంతో రైతులు దుక్కులు దున్నుకుని పొలాలను సిద్ధం చేసుకున్నారు. వచ్చే నెలలో మంచి వర్షాలు పడితే ముందస్తుగా విత్తనం విత్తుకునేందుకు కూడా రైతులు సమయత్తమవుతున్నారు. కాని ఇప్పటి వరకు ప్రభుత్వం మాత్రం రైతుకు అవసరమైన విత్తనం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోలేదు. ఇంకా విత్తన సేకరణలోనే ఉండిపోయింది. ఇతర పంటల సాగుకు తగిన చర్యలేవన్న విమర్శలున్నాయి.ఇకపోతే రైతుకు అందిస్తామన్న అన్నదాత సుఖీభవను ఇస్తారో లేదో తెలియకుండా ఉంది. కేంద్రమిస్తే, దానితో కలిపిస్తామని ప్రభుత్వం ప్రకటిస్తోంది. అది ఎప్పుడన్నది మాత్రం ఇంకా నిర్ధారణ అవలేదు. ఖరీఫ్ పంటల సాగుకు రైతులు పెట్టుబడుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతుకు భరోసానివ్వాలని కోరుతున్నారు.ఇక గత వారంలో రాజకీయంగా హడావుడి అంతా అధికార తెలుగుదేశం పార్టీ నిర్వహించిన మహానాడు చుట్టూ జరిగింది. సత్యసాయి జిల్లాలో అక్కడి జిల్లా మహానాడు జరిగింది. ఆ తరువాత కడప జిల్లాలో జరిగిన మహానాడుకు నేతలంతా తరలివెళ్లారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం

కౌన్సిల్ సమావేశంలో సభ్యుల మండిపాటు

సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ దిల్షాద్ ఉన్నీసా

ప్రజాశక్తి-కదిరి టౌన్

ప్రతి కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యలు, అక్రమ నిర్మాణాలపై సభ్యులు ఫిర్యాదు చేస్తున్నా చర్యలు తీసుకోవడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాలులో శనివారం ఛైర్‌పర్సన్ దిల్షాద్ ఉన్నీసా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముందుగా జవాను మురళీ నాయక్ మృతికి సంతాపంగా 2 నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ సహకారంతో పట్టణాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. సభ్యులు మాట్లాడుతూ గత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అల్లా ముస్తఫా మాట్లాడుతూ 24వ వార్డులోని బైపాస్ రోడ్డు పక్కన అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని ఆధారాలతో సభ ముందు ఉంచినా చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. అయితే అధికారులు పొంతనలేని సమాధానం చెప్పి దాటవేత ధోరణి ప్రదర్శించారు. ఫయాజ్ అలీఖాన్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం జగనన్న కాలనీల్లో 2వేల పైచిలుకు పట్టాలు మంజూరు చేసిందని, అయితే పట్టా పొందిన లబ్ధిదారులకు హద్దులు చూపలేదని తెలిపారు. పట్టణంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వివేక్, టౌన్ ప్లానింగ్ రికార్డులు అన్నీ ఛైర్‌పర్సన్ గుప్పెట్లో ఉండేవని, ఇకపై ఏ విభాగానికి సంబంధించిన రికార్డులు ఆ విభాగంలో బీరువాలో ఉంచాలని కోరారు. బైపాస్ రోడ్డు డివైడర్ మధ్యలో మొక్కలు తొలగించాలని కోరినా స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యుడు ఖాసీం మాట్లాడుతూ 12వ వార్డులో దోమల నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నానాద్దా, అరవ గుడిసెలు నుంచి రైల్వే బ్రిడ్జి వరకు వంకను శుభ్రం చేయాలని కోరారు. అనంతరం అజెండాలోని కొన్నింటికి సభ్యులు ఆమోదం తెలిపి మరికొన్నింటిని తిరస్కరించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొత్త చెరువు రూరల్

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి తెలిపారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి, ఇరగంపల్లిలో శనివారం ఆమె మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డితో కలిసి ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక కష్టాలు ఉన్నా ప్రభుత్వం పేదలకు సకాలంలో పింఛన్లు అందజేస్తుందన్నారు. ప్రతి ఇంట్లో చదువుకొనే ప్రతి విద్యార్థికి 'తల్లికి వందనం' కింద జూన్‌లో రూ. 15 వేలు ఇవ్వనున్నారు. ఆగస్టులో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందన్నారు. ఎన్నికల హామీలన్నీ తప్పకుండా అమలు చేస్తామన్నారు. ఇరగంపల్లి నుంచి తలమర్లకు సుమారు 2.56 కిలోమీటర్ల తారురోడ్డు ఏర్పాటుకు రూ. 94 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా తనకు నేరుగా లేదా వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పల్లె రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ. 18 కోట్లతో రహదారుల నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. అనంతరం వారు బుక్కపట్నంలోని కోటవీధిలో, జానకంపల్లి, పుట్టపర్తి మున్సిపాలిటీలోని కర్నాటక నాగేపల్లిలో పింఛన్లు పంపిణీ చేశారు. వారి వెంట నాయకులు సాలెక్కగారి శ్రీనివాసులు, మండల కన్వీనర్లు శ్రీనివాసులు, రామకృష్ణ, మల్లిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగాధర్, మైలే శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో ఇరగంపల్లిలో మురుగునీటిని తొలగిస్తున్న జెసిబి

ఇరగంపల్లిలో నీటి మడుగు తొలగింపు

ఇరగంపల్లిలో ఇళ్ల ముందు మురుగు నీరు నిలిచి, దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయని, దుర్వాసన భరించలేకున్నామని, రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే మురుగు నీటిని తొలగించాలని ఎంపిడిఒ నటరాజ్, గ్రామ కార్యదర్శిని ఆదేశించారు. అలాగే అప్పటికప్పుడు జెసిబిని పిలిపించి మురుగు నీటి మడుగును తీయించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నేరాలు ఘోరాలు

టిప్పర్, బైక్ ఢీ.. వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండలంలోని కటారుపల్లి క్రాస్ వద్ద శనివారం టిప్పర్, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతిచెందారు. జమేదారు గంగాధర్ తెలిపిన వివరాలు.. ముదిగుబ్బ మండలానికి చెందిన ప్రసాద్(36) కటారుపల్లి పంచాయతీలోని జరుకువారిపల్లిలో వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో అత్తగారింటికి వచ్చిన ప్రసాద్ ఓ పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై గాండ్లపెంటకు వచ్చి తిరిగి వెళ్తుండగా కదిరి నుంచి వస్తున్న టిప్పర్ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య శ్రావణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. అలాగే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జమేదారు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం పట్టణంలోని శాంతినగర్‌లో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. కడప జిల్లాలోని వేంపల్లెకు చెందిన చిన్న నరసింహులు, భాగ్య(34) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. చిన్ననరసింహులు వేంపల్లె ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్నారు. భాగ్య సుమారు 20 రోజుల క్రితం తన పుట్టినిల్లు అయిన ధర్మవరం వచ్చింది. శాంతినగర్‌లోని వారి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య పాల్పడింది. ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

హత్యాయత్నం కేసు నమోదు

ప్రజాశక్తి-కదిరిటౌన్

పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడగా బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. వివరాలు.. షేక్ ఇమామ్ సాబ్ పట్టణంలోని మదీనా మసీద్ వీధి, రైల్వే స్టేషన్ రోడ్‌లో నివాసం ఉంటున్నారు. ఇతను శుక్రవారం రాత్రి కుమారుడు దాదాపీర్‌తో కలిసి ఉషారాణి హాస్పిటల్ ముం దు వెళ్తుండగా పాత కక్షలు మనసులో పెట్టుకొన్న ముజ్జు, మైను, ఇనామ్, తన్వీర్, రఫీక్ అతడిని అడ్డగగించి దాడి చేసి చాకులతో పొడిచి వెళ్లిపోయారు. బాధితుడు షేక్‌ఇమామ్‌సాబ్ ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. కాగా నిందితులు మోటార్ సైకిల్ రేసుల్లో పాల్గొనడంతో పాటు జులాయిగా తిరిగేవారని, తరచూ గొడవలు పడేవారని తమ దృష్టికి వచ్చిందని, దీంతో వీరిపై రౌడీ షీట్ నమోదు చేస్తామని సిఐ తెలిపారు.

మహిళను మోసం చేసిన నిందితుడికి రిమాండ్

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఒంటరి మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, అత్యాచారం చేసి గర్భిణి కావడానికి కారణమైన ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నంబులపూలకుంట మండలంలోని గంగిరెడ్డులోళ్లపల్లి గ్రామానికి చెందిన ఉలవల హరిప్రసాద్‌రెడ్డి కదిరి మండలంలోని కుమ్మరవాండ్లపల్లి గ్రామంలో కాంట్రాక్ట్ బేసిస్ కింద లైన్‌మేన్‌గా పని చేస్తున్నాడు. అతడు ఐదేళ్ల నుంచి వివాహమై భర్త నుంచి వేరుగా ఉంటు కదిరి టౌన్ నల్లగొండ వీధిలో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న మహిళతో సన్నిహితంగా ఉండేవాడు. పెళ్లి చేసుకుంటానని, ఆమె కొడుకును సరిగా చూసుకుంటారని నమ్మించి ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడి ఆమెకు గర్భం రావడంతో మొఖం చాటేశాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు అతడిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి 14 రోజులు రిమాండ్‌కు విధించగా అనంతపురం జిల్లా జైలుకు తరలించారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలోని ఉప్పలపాడు వద్ద శనివారం జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారి బి.పెద్దిరెడ్డి ఐదు ట్రాక్టర్లను సీజ్ చేశారు. మండలంలోని ఉప్పలపాడు, తాడిమర్రి మండలంలోని సీసీ రేవు గ్రామాల మధ్య చిత్రావతి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించిన అధికారులు దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసి ముదిగుబ్బ పోలీసులకు అప్పజెప్పారు.

రోడ్డు ప్రమాదంలో సెయింట్ మేరీస్ స్కూల్ అధినేత మృతి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

జాన్‌రెడ్డి(ఫైల్‌ఫొటో)

పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న సెయింట్ మేరీస్ పాఠశాల అధినేత, విద్యావేత్త ప్రయివేటు పాఠశాలలకు మార్గదర్శకుడు జాన్‌రెడ్డి శనివారం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఈయన బళ్లారి నుంచి ధర్మవరం వస్తుండగా ఉరవకొండ సమీపంలో ఈయన ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురై మృతిచెందారు. ఆయన భార్య, ఇద్దరు పిల్లలు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రయివేట్ పాఠశాలల సంఘం సంతాపం

సెయింట్ మేరీస్ ప్రయివేటు పాఠశాల కరస్పాండెంట్ జాన్‌రెడ్డి మృతి పట్ల ప్రయివేట్ పాఠశాలల సంఘం గౌరవాధ్యక్షులు చాంద్‌బాషా, అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి నరేంద్రతో పాటు పట్టణ ప్రయివేట్ పాఠశాల కరెస్పాండెంట్లు సంతాపం తెలిపారు. వారు మాట్లాడుతూ జాన్ రెడ్డి కారు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు. ప్రయివేటు పాఠశాలల సంఘాన్ని ఏర్పాటు చేయడంలో ఆయన కీలకపాత్ర పోషించారన్నారు. ఆయన ఆధ్వర్యంలో ప్రయివేటు అసోసియేషన్ సంఘం అభివృద్ధి చెందిందని తెలిపారు. జాన్‌రెడ్డి ఆత్మకు శాంతి కలగాలని ప్రత్యేకంగా ప్రార్థించారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. వారు శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 15 మందికి రూ. 9.68 లక్షల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆరోగ్యం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. అందుకోసం అధునాతన పరికరాలు సమకూర్చడం, ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన వారికి సిఎం సహాయ నిధి ద్వారా ఆర్థికంగా ఆదుకుంటుందన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే రాజు

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

దేశంలోనే ఒక రోజు ముందుగా పింఛన్లు ఇస్తున్న ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. ఆయన మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి రొళ్ల మండలంలోని దాసప్ప పాలెం, గొట్టుగుర్కి గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. అంతకుముందు వారికి ఆయా గ్రామాల్లో ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని సకాలంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వారి వెంట మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, దాసిరెడ్డి, కుమార స్వామి, గణేష్, మద్దనకుంటప్ప, జడ్పిటిసి ఉమేష్, పాండురంగప్ప, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ బిఎస్ గురుమూర్తి, మంజునాథ్, రాజు, రమేష్, భరత్‌కుమార్, నాగరాజు, హేమంత్‌కుమార్, రవికుమార్, బాలకృష్ణ ఉన్నారు.

ఆదాయాన్ని అభివృద్ధికే ఖర్చు పెట్టాలి

కౌన్సిల్ సమావేశంలో సభ్యులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణ అభివృద్ధికి ఎప్పుడూ సహకరిస్తామని, అయితే జనరల్ ఫండ్స్‌ను సంబంధిత వాటికి మాత్రమే ఖర్చు చేయాలని పలువురు కౌన్సిలర్లు తెలిపారు. పట్టణంలోని పురపాలక సంఘం కార్యాల యంలో శనివారం ఛైర్‌పర్సన్ లక్ష్మీ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించగా 16 అంశాలపై చర్చించి ఆమోదించారు. వైస్ ఛైర్మన్ జయరామిరెడ్డి, కౌన్సిలర్లు చందమూరి నారాయణ రెడ్డి, మాసపల్లి సాయికృష్ణ, గజ్జల శివయ్య, గోరకాటి పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ స్థలాలకు కంచె ఏర్పాటుపై ప్రశ్నించగా 4 రోజుల్లో సమాచారం ఇస్తామని కమిషనర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం అభివృద్ధి లేదని, అవినీతి జరుగుతోందని ఆరోపించారు. కాంట్రాక్టర్లకు జనరల్ ఫండ్ నిధులతో నగదు ఇవ్వరాదని తెలిపారు. మార్కెట్‌లో బకాయిల వసూలుపై ప్రశ్నించారు. ఖాళీగా ఉన్న మున్సిపల్ గదులను భర్తీ చేయాలని కోరారు.

సమావేశంలో అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

పట్టణంలో కుక్కల బెడద ఎక్కువైందన్నారు. చెత్త వాహనాలు మూలన పడ్డాయన్నారు. ప్లాస్టిక్ నిషేధం విషయంలో ఏమాత్రం ఫలితం లేదన్నారు. చేపలు ఒకే చోట విక్రయించేలా చర్యలు చేపట్టాలన్నారు. డివైడర్ల మధ్యలో తప్పు పట్టిన ఇనుప స్తంభాలను తొలగించాలన్నారు. ఆయా ప్రశ్నలకు కమిషనర్ సమాధానాలు ఇచ్చారు. సమావేశంలో వైస్ ఛైర్మన్లు జయరామిరెడ్డి, శంషాద్ బేగం, కౌన్సిలర్లు, మున్సిపల్ ఈఈ సాయికృష్ణ, డీఈ కళావతి, కృష్ణారావు, శిరీష, టిపిఆర్ఒ విజయభాస్కర్, టిపిఒ అలివేలమ్మ, ఆర్వో ఆరిఫ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

10న 'యోగాంధ్ర' : ఆర్డీవో

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

యోగాంధ్రపై అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని ఆర్‌డిఒ కె.మహేష్ ఆదేశించారు. 'యోగాంధ్ర-2025' కార్యక్రమంపై శనివారం ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని శాఖల ప్రభుత్వ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆర్‌డిఒ మాట్లాడుతూ జూన్ 10వ తేదీ ధర్మవరంలో నిర్వహించే 'యోగాంధ్ర-2025' కార్యక్రమంలో కలెక్టర్ టిఎస్.చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ పాల్గొంటారన్నారు. దానికి సంబంధించిన ఏర్పాట్లు, నిర్వహణపై ఆయా శాఖల అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో డీఎస్పీ హేమంత్‌కుమార్, డిఎల్‌పిఒ కె.శివకుమారి, మున్సిపల్ మేనేజర్, డివిజన్ పరిధిలోని ఎంపిడిఒలు, ఎంఇఒలు, సిడిపిఒలు, డ్వామా, డిఆర్‌డిఎ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన

అమడగూరు : పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ట్రైనీ డీఎస్పీ ఉదయపావని సూచించారు. మండలంలోని మహమ్మదాబాద్ ఎస్సీ కాలనీలో శనివారం పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ట్రైనీ డీఎస్పీ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులకు ఎలాంటి భంగం కలిగినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కులవివక్ష, అంటరానితనం, వృద్ధులు, మైనార్టీ, దళిత, వెనుకబడిన, సమాన ఉపాధి హామీ, తదితర హక్కులు గురించి వివరించారు. గ్రామాల్లో కుల, మతాలకు అతీతంగా కలిసి మెలసి ఉండాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సర్పంచి సునీతమ్మ, ఎంపీటీసీ వెంకట లక్ష్మమ్మ, ఆర్ఐ రామకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి జానకి పాల్గొన్నారు.

'అంగన్వాడీ' లీడర్లపై కథనాలు అవాస్తవం : సిఐటియు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

అంగన్వాడీ యూనియన్ లీడర్లపై దినపత్రికల్లో వచ్చిన కథనాలు పూర్తిగా అవాస్తవమని సిఐటియు నాయకులు జె.వి.రమణ, అయూబ్‌ఖాన్, ఆదినారాయణ స్పష్టం చేశారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో శనివారం వారు ధర్మవరం ప్రాజెక్ట్ అంగన్వాడీ యూనియన్ లీడర్లు డి.చంద్రకళ, సరస్వతితో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంగన్వాడీలో ఖాళీల భర్తీ, ఉద్యోగోన్నతుల అంశాల్లో పైరవీలు, అవినీతి జరిగిందని, అందులో అధికా రులకు యూనియన్ లీడర్లు సహకరించారని ఇటీవల రెండు దినపత్రికల్లో ప్రచురితమైన కథనాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికారుల గురించి వాస్తవాలు వెలికితీసి చట్టపరమైన చర్యలు తీసుకుంటే తమకేమీ అభ్యంతరం లేదన్నారు. కానీ యూనియన్ లీడర్లు అధికారులకు సహకరించారని వార్తలు రాయడం పూర్తిగా అసత్యమన్నారు. అధికారులకు లీడర్లు సహకరించినట్లు సాక్షాధారాలు ఉంటే సిఐటియు నాయకులకు లేదా అంగన్వాడీ జిల్లా నాయకులకు తెలియజేస్తే వారిపై తాము శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇకపై అంగన్వాడీ యూనియన్ లీడర్లపై అనవసర, నిరాధార ఆరోపణలు చేయరాదని హెచ్చరించారు. సమావేశంలో సిఐటియు నాయకులు ఎల్.ఆది నారాయణ, ఎస్.హైదర్‌వలి, పోతక్క, దీన, అరుణ, గాయత్రి, భారతి, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

భూసార పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి-కదిరి టౌన్

సాగుకు ముందు ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలని రెడ్డిపల్లి వ్యవసాయ విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మాధవి సూచించారు. ఐసిఎఆర్ ఢిల్లీ వారి సహకారంతో శనివారం రూరల్ మండలంలోని ముత్యాలచెరువు, కుటాగుళ్ల గ్రామాల్లో 'వికసిత కృషి సంకల్ప అభయాన్' కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్త మాధవి మాట్లాడుతూ రైతుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న వివిధ రకాల సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం భూసార పరీక్ష పత్రాలను రైతులకు అందజేశారు. అభివృద్ధి పరచిన ఆముదం ఐసిహెచ్-5 విత్తనాలను ఒక్కో గ్రామంలో ఇద్దరేసి అభ్యుదయ రైతులకు ఉచితంగా పంపిణీ చేయాలని సూచించారు. కెవికె రెడ్డిపల్లి వారు తయారుచేసిన కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో జాతీయ నూనె గింజల పరిశోధన స్థానం నుంచి సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మంజునాథ్, జిల్లా డాట్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ రామసుబ్బయ్య, ఉద్యాన అధికారి ప్రతాప్‌రెడ్డి, ఏడి సనావుల్లా, మండల వ్యవసాయ అధికారి శ్రీహరినాయక్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఆముదం విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

సైకిల్‌యాత్ర యువతకు సన్మానం

ప్రజాశక్తి-పెనుకొండ

రాయలసీమ అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని మంత్రి సవిత తెలిపారు. మహానాడు విజయంతం కావడంతో కొన్ని దుష్టశక్తులు కుమిలిపోతున్నాయన్నారు. కడప గడ్డ టీడీపీ అడ్డా అని మంత్రి స్పష్టంచేశారు. కడప మహానాడు విజయవంతం కావడంతో శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం పెనుకొండ నుంచి కడప మహానాడుకు సైకిల్ యాత్ర చేపట్టిన 44 మంది యువతను మంత్రి శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. సైకిల్ యాత్రలో ఉపయోగించిన సైకిళ్లను యువతకు బహుమతిగా అందజేశారు. మంత్రి మాట్లాడుతూ రాయలసీమ అభివృద్ధిపై సిఎం చంద్రబాబుకు ప్రత్యేక విజన్ ఉందన్నారు. రాయలసీమలో 2019 వరకూ టిడిపి హయాంలో రూ. 13 వేల కోట్లను నీటి పారుదల ప్రాజెక్టులకు ఖర్చు చేశామన్నారు. పది రోజుల్లో కడప స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభిస్తామని తెలిపారు.


సైకిల్ యాత్ర సభ్యులతో మంత్రి సవిత

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంపై ర్యాలీ

పుట్టపర్తి రూరల్ : ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని డిఎంహెచ్ఒ ఫైరోజ్‌బేగం జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ డిఎంహెచ్ఒ ఆఫీస్ నుంచి ప్రశాంతి గ్రామం వై జంక్షన్ కూడలి వరకూ నిర్వహించి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ర్యాలీలో ధూమపానం ఆరోగ్యానికి హానికరమని నినాదాలు చేశారు. పొగాకు ఉత్పత్తులపై ప్రజలను చైతన్యవంతం చేశారు. డిఎంహెచ్ఒ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు వాడడం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు.

మాజీ ఎమ్మెల్యేని కలిసిన వైసిపి రాష్ట్ర సభ్యులు

పుట్టపర్తి క్రైమ్ : పట్టణంలోని వైసిపి కార్యాలయంలో శనివారం మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రాజునాయుడు, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నర్సిరెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డి.భారతి, వాలంటీర్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ టిడి.విజయ్‌భాస్కర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తమ నియామకానికి సహకరించినందుకు శ్రీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పూలమాలలు వేసి శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం శ్రీధర్‌రెడ్డి వారిని సన్మానించారు. వారు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని, తమకు కేటాయించిన విధులను చిత్తశుద్ధితో నిర్వహిస్తామని తెలిపారు.

వైసిపి నాయకులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే

జాబ్‌మేళాలో 17 మందికి ఉద్యోగాలు

ధర్మవరం రూరల్ : పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 17 మందికి ఉద్యోగాలు వచ్చినట్లు ప్రిన్సిపల్ ముసలిరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలో కెవెల్ (గ్రూప్స్), అమెజాన్ వేర్‌హౌస్ మేనేజ్మెంట్ ప్రతినిధి రఘునాథరెడ్డి, ఆర్‌డిజి టెక్నికల్ సపోర్ట్ ప్రతినిధి ఇర్షాద్ అహ్మద్ ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు. మొత్తం 78 మంది హాజరుకాగా కెవెల్ గ్రూపునకు 11 మంది, ఆర్‌డిజి టెక్నికల్ సపోర్ట్‌కు ఆరుగురు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన వారిని శ్రీబాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ పల్లె వెంకటకృష్ణకిషోర్, ప్రిన్సిపల్ అభినందించారు.

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

కదిరి టౌన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్షాద్ ఉన్నీసా తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీలో భాగంగా శనివారం ఆమె మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో వృద్ధులు, వికలాంగులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ఆమె వెంట వైస్ ఛైర్మన్ సుధారాణి, కమిషనర్ కిరణ్‌కుమార్, కౌన్సిలర్ కె.జయమ్మ కృష్ణప్ప, టిడిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కొత్తచెరువు: ఆర్‌జియు కెటిపియుసిలో ప్రవేశాలకు దరఖాస్తు గడువును జూన్ 10వ తేదీ వరకూ పొడిగించినట్లు జిల్లా వృత్తి విద్య అధికారి లాజర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వైసిపి నాయకులకు సన్మానం

ఓబుళదేవరచెరువు : వైసిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి ఉంట్లవారిపల్లికి చెందిన కుర్లి నర్సిరెడ్డి, బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజునాయుడులను శనివారం ఆ పార్టీ శ్రేణులు స్థానిక అభయాంజనేయస్వామి దేవస్థానం వద్ద ఘనంగా సన్మానించారు. రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ పార్టీ అధినేత జగన్ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామన్నారు. వైసిపి బలోపేతమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. పదవులు రావడానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కుర్లి దామోదర్ రెడ్డి, కుర్లి రంగారెడ్డి, మండల కన్వీనర్ లక్ష్మిరెడ్డి, తుమ్మల షామీర్‌బాషా, శిరగం హరినాథ్‌రెడ్డి, ఎద్దుల రామసుబ్బారెడ్డి, కోళ్ల కృష్ణారెడ్డి, సర్పంచులు జగన్మోహన్‌చౌదరి, తొట్లి రంగారెడ్డి, గోవిందు, రమణ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సహజం : పల్లె

ప్రజాశక్తి-కొత్తచెరువు

ప్రతి ఉద్యోగికి విరమణ తప్పనిసరి అని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఓ ప్రయివేటు కళ్యాణ మండపంలో శనివారం తహశీల్దార్ నీలకంఠారెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పల్లెతో పాటు పలువురు అధికారులు, నాయకులు నీలకంఠారెడ్డికి పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. పల్లె మాట్లాడుతూ నీలకంఠారెడ్డి బాధ్యతలను ఎంతో సమర్థవంతంగా నిర్వహించి మంచి అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. తహశీల్దార్ నీలకంఠారెడ్డి మాట్లాడుతూ తన ఉద్యోగ జీవితంలో ప్రజలకు ఎన్నో సేవలు అందించానన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, తహశీల్దార్ కళ్యాణ్, డిప్యూటీ తహశీల్దార్ బాలాంజనేయులు, స్వాతి, టిడిపి నాయకులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, మాణిక్యం బాబా, సుధాకర్, ఆర్.నాగేంద్ర, టౌన్ కన్వీనర్ శ్రీనివాసులు పాల్గొన్నారు

నీలకంఠారెడ్డిని సన్మానిస్తున్న పల్లె రఘునాథరెడ్డి, ఉద్యోగులు

పావగడలో పూల వ్యాపారులకు స్థలం కేటాయింపు

ప్రజాశక్తి-పావగడ

పట్టణంలోని కొత్త బస్టాండ్‌కు వెళ్లే రోడ్డు మలుపులో పూల వ్యాపారులు వాహనాల రాకపోకలకు అసౌకర్యం కలిగిస్తున్నారని అందిన ఫిర్యాదు మేరకు శనివారం మున్సిపల్ అధికారులు పూల వ్యాపారులను కార్యాలయానికి పిలిపించి చర్చించారు. మున్సిపల్ ఛైర్మన్ జి.సుదేష్‌బాబు మాట్లాడుతూ ద్విచక్ర వాహనాల పార్కింగ్ కోసం నిర్మించిన షెడ్డులో స్థలం కేటాయించామన్నారు. నిర్ణీత ప్రదేశాల్లోనే పూలు విక్రయించాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని సూచించారు. రానున్న రోజుల్లో మార్కెట్ అభివృద్ధికి డ్రెయినేజీ పక్కనే స్లాబ్, ఎత్తయిన గోడ నిర్మిస్తామని తెలిపారు. చీఫ్ ఆఫీసర్ జాఫర్ షరీఫ్ మాట్లాడుతూ హోల్‌సేల్ పూల వ్యాపారాన్ని వ్యవస్థీకృతంగా నిర్వహించాలనే లక్ష్యంతో ఈ చర్య తీసుకున్నామని, పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ మాజీ అధ్యక్షుడు రామాంజినప్ప, సభ్యులు వెంకటరమణ, విజయ్‌కుమార్, సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ షంషుద్దీన్, శాంతకుమార్ పాల్గొన్నారు.

మాజీ ఎంపిటిసికి 'పల్లె' పరామర్శ

నల్లమాడ : నల్లమాడలో ఈ నెల 16వ తేదీ మాజీ ఎంపిటిసి వెంకటలక్ష్మమ్మ కుమారుడు శ్రీనివాసులు గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి శనివారం నల్లమాడ వెళ్లి వెంకటలక్ష్మమ్మను పరామర్శించి, అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆమెకు ఆర్థికసాయం అందజేశారు. అలాగే శ్రీనివాసులు కుమార్తెలు, భార్యను పరామర్శించారు. ఆయన వెంట డాక్టర్ నాగభూషణం నాయుడు, మంజురెడ్డి, కె.బయారెడ్డి, ఎం.రామచంద్ర, చెన్నకేశవులు, బాలిరెడ్డి, కెబి.మంజునాథ్‌రెడ్డి, డి.హనుమంతరెడ్డి, ఎం.రవికుమార్, కె.శ్రీనాథ్, ఎం.రామకృష్ణ ఉన్నారు,

అంకితభావంతో పనిచేసిన వారికే గుర్తింపు : డిపిఆర్ఒ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసిన ఉద్యోగులకు సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తాయని సమాచార, పౌర సంబంధాల శాఖ జిల్లా అధికారి వేలాయుధం పేర్కొన్నారు. ఆ శాఖలో పని చేస్తున్న జూనియర్ సహాయకులు జింకల రామన్న, సీనియర్ సహాయకులు రవిప్రకాష్ ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం డిపిఆర్ఒ కార్యాలయ సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వారిని ఉద్యోగులు, అధికారులు, పాత్రికేయులు, బంధుమిత్రులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రామాంజనేయులు, ఎపిఆర్ఒ ఫక్రుద్దీన్, ఆర్టీసీ కార్యాలయ ఏవో ఉషారాణి, ప్రభావతి, సుహాసిని, సావిత్రి, రేఖ, పాత్రికేయులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రామన్న దంపతులను సన్మానిస్తున్న డిపిఆర్ఒ

IN THE COURT OF THE PRL.DISTRICT JUDGE, ANANTHAPURAMU

E.P. No:448/2024 in ARB Case No:74/2022

Between:

M/S. Five Star Business Finance Limited, Anantapur Represented by its Authorized Signatory.G.Giddaiah, Kurnool **...Petitioner/ D.Hr**

V/S

1.Dasari Mani W/O Dasari Lakshmi Narayana, hindu, age 31 years, business, D.No.31-112, Ram Nagar, Dharmavaram, Anantapur Distict.

2. Dasari Lakshmi Narayana S/O Pullanna, D.No.31-112, Ram Nagar, Dharmavaram, Anantapur Distict.

...Respondants/ J.Drs

వేలం ప్రకటన

అర్జీదారుడు ఇ.పి.మొత్తమును రాబట్టుటకు 1వ జె.డి.ఆర్.కు సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు దాఖల ఆస్తిని పై తెలిపిన కోర్టులో వేలమునకు తెచ్చియున్నారు.వేలములో పాల్గొనదలచి వారు 16/06/2025వ తేదిన ఉదయం 10:30 గం॥లకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలములో పాల్గొనవచ్చును.

SCHEDULE

The property is situated in RD Hindupur and SRD of Dharmavaram, within the fields of Kunuthuru Village & Dharmavaram Municipal Area, Ward No.31, Ramnagar, Anantapur District.

Sy.No: 544-2E1A, **Plot No**.26, D No:31-110-1, **Extent**:121 Sq Yards.

Boundaries: **East by**: 16 feet Road, **West by**:Plot No.32 & 33, **North by**: 20 feet Road and **South by**:Plot No.27 belonging to P.Mahalakshmi. **Measurements**: **East-West**-39 feet or 11.887 meters and **North-South** - 16 feet or 4.876 meters.**Totally measuring 121 sq yards** Building **Measurements**: **East-West** - 39 feet and **North-South** - 16 feet.

Total 624 Sq feet

DHr Value Rs.9,80,000/-

Amina Value Rs.10,00,000/-

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

M.SURESH KUMAR, Advocate, Ananthapuram. Cell: 9441168233.